## అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం




జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరం న్యూస్) సెప్టెంబరు 29: హిందూ ధర్మంపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మ మండల కేంద్రంలోని సర్వీస్ రోడ్డుపై మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ శ్రీరాముడు, పరమ శివుడి మధ్య సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ విభజన రేఖలను సృష్టించడం ఎంత వరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, ఉడుత రంజిత్, వల్లాల ఉపేందర్, ఆకుల రామచందర్, యామంకి కొమురెల్లి, మేడిపల్లి వెంకటేశ్వర్లు, కావటి ప్రవీణ్, తోట మహేష్, చెవ్వ రాజు, బోళ్ల అఖిల్, గణేష్, సురేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

## తప్పుడు ప్రచారాలు మానుకోవాలి..

- గ్యాస్ నిబంధనలు తెలుసుకోవాలిలి
- సోషల్ మీడియా ప్రచారాలతో వినియోగదారులను తప్పుదోవ పట్టించొద్దు..
- గ్యాస్ రెగ్యులేటర్ రీప్లేస్మెంట్పై
- వినియోగదారులకు ఏజెన్సీ స్పష్టత..
- వ్యక్తిగత కారణాలతో అసత్య ప్రచారాలు చేయొద్దు..
- తప్పుడు ప్రచారాలపై చట్టపరమైన చర్యలు:
- శ్రీ సాయి వెంకటేశ్వర హెచ్పీ గ్యాస్ ఏజెన్సీ.



ఖమ్మం/ మధిర సెప్టెంబర్ 29 (అక్షరం న్యూస్)

శ్రీ సాయి వెంకటేశ్వర హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీపై సోషల్ మీడియాలో కొందరు వ్యక్తులు చేస్తున్న అసత్య, అవాస్తవ ప్రచారాలను మానుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులు సూచించారు. వ్యక్తిగత కారణాలతో ఏజెన్సీ ప్రతిష్టకు భంగం కలిగించేలా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారాలతో వినియోగదారుల్లో అనవసరమైన అపోహలు, గందరగోళం ఏర్పడుతున్నాయని తెలిపారు.గ్యాస్ కంపెనీ నిబంధనల ప్రకారం రెగ్యులేటర్ విషయంలో గత కొంతకాలంగా అమల్లో ఉన్న మార్పిడి విధానాలను వినియోగదారులు తెలుసుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులు సూచించారు. రెగ్యులేటర్‌లో షార్ట్ ఏజ్ సమస్య ఏర్పడినప్పుడు కొత్త రెగ్యులేటర్ కోసం పాత రెగ్యులేటర్‌ను రీప్లేస్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై పూర్తి అవగాహన లేకుండా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం వల్ల వినియోగదారులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందన్నారు.రెగ్యులేటర్ రీప్లేస్‌మెంట్‌కు సంబంధించి మ్యానువల్ బిల్లు మాత్రమే జారీ అవుతుందని, కంప్యూటర్ బిల్లు ఉండదని ఏజెన్సీ నిర్వాహకులు స్పష్టం చేశారు. రెగ్యులేటర్ డిపాజిట్ రూ.300, పైపు ధర రూ.190 కలిపి మొత్తం రూ.490గా ఉంటుందని తెలిపారు.ఏజెన్సీ సేవలు నిబంధనల ప్రకారమే కొనసాగుతున్నాయని, సోషల్ మీడియాలో వచ్చే నిర్ధారణలేని ప్రచారాలను నమ్మవద్దని వినియోగదారులను కోరారు. గ్యాస్ సరఫరా, రెగ్యులేటర్, పైపు లేదా ఇతర సేవలకు సంబంధించి సందేహాలు ఉంటే సోషల్ మీడియా ప్రచారాలను ఆధారంగా చేసుకోకుండా నేరుగా ఏజెన్సీ నిర్వాహకులను లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.అదేవిధంగా ఏజెన్సీ ప్రతిష్టను దెబ్బతీసేలా సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్న వారిపై అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు.

## బెన్నీ ఫ్యాన్సీ వరల్డ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్..



ఖమ్మం/వైరా టౌన్ సెప్టెంబర్ 29 (అక్షరం న్యూస్)

వైరా పట్టణంలో పాత కూరగాయలు మార్కెట్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన బెన్నీ ఫ్యాన్సీ వరల్డ్, బుక్స్ స్టాల్ అండ్ జనరల్ స్టోర్ ను ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చిన్న వ్యాపారులను ప్రోత్సహించడం అభినందనీయమని, బెన్నీ ఫ్యాన్సీ వరల్డ్ లో నాణ్యమైన వస్తువులు తక్కువ ధరకు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు.షాపు నిర్వాహకులకు గుండ్ల బాబురావు, రాజేశ్వరిలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, ఎస్సై పుష్పాల రామారావు, పమ్మి అశోక్, సీతారాములు, బొల్లా గంగారావు, ఐవి నాగశ్వరావు, చెరుకూరి కిరణ్, వీరయ్య, వి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మవిశ్వాసం.. నిరంతర సాధనతో పోలీస్ ఉద్యోగం సాధ్యమే..





- పక్కా ప్రణాళికతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి..
- ప్రముఖ హిస్టరీ ఫ్యాకల్టీ డాక్టర్ అబ్దుల్ కరీం
- పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్--రైట్ ఛాయిస్ ఉచిత కోచింగ్ శిబిరంలో ప్రత్యేక బోధన..

ఖమ్మం/స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 29 (అక్షరం న్యూస్)

ఖమ్మం: ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పక్కా ప్రణాళికతో నిరంతర సాధన చేస్తే ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధ్యమేనని ప్రముఖ హిస్టరీ ఫ్యాకల్టీ, రచయిత డాక్టర్ అబ్దుల్ కరీం అన్నారు. పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్--రైట్ ఛాయిస్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహిస్తున్న ఎస్సై, కానిస్టేబుల్ ఉచిత కోచింగ్ శిబిరంలో మంగళవారం ఆయన అభ్యర్థులకు హిస్టరీ ప్రత్యేక తరగతులు నిర్వహించారు.పోటీ పరీక్షల్లో చరిత్రను సులభంగా, సమర్థవంతంగా చదివేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. కాలక్రమం, ముఖ్య సంఘటనలు, వాటి కారణాలు, ఫలితాలను అర్థం చేసుకుంటూ చదవాలని సూచించారు. మ్యాప్‌లు, టైమ్ లైన్‌లను ఉపయోగించుకోవడం ద్వారా



అంశాలను సులభంగా గుర్తుంచుకోవచ్చన్నారు. పోలీస్ నియామక పరీక్షల్లో చరిత్ర నుంచి ప్రశ్నలు ఏ విధంగా అడుగుతున్నారో, వాటిని ఎలా విశ్లేషించి సమాధానం ఇవ్వాలో అభ్యర్థులకు వివరించారు.ప్రామాణిక పుస్తకాలను ఎంపిక చేసుకుని ప్రణాళికాబద్ధంగా చదవడంతో పాటు ప్రతిరోజూ పునశ్చరణ, మాక్ టెస్టులు నిర్వహించుకోవాలని సూచించారు. పరీక్షకు చివరి వరకు సమయం వృథా చేయకుండా నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం సిలబస్‌ను పూర్తి చేసుకోవాలని తెలిపారు.

రైట్ ఛాయిస్ చైర్మన్ మెండెం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ..

ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో సివిల్స్ అభ్యర్థులకు తరగతులు నిర్వహిస్తున్న డాక్టర్ అబ్దుల్ కరీం సార్ ఖమ్మం వచ్చి ప్రత్యేకంగా బోధించడం అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రస్థాయి ఫ్యాకల్టీతో శిక్షణ అందించడంతో పాటు అభ్యర్థులకు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ ఉన్న నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ, వారి ఉద్యోగ సాధనకు ప్రోత్సాహం అందిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఖరీఫ్ 2026 ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి.....





- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి
- కొనుగోలు చేసిన ధాన్యాన్ని
- వెంటనే గోదాములకు తరలించాలి..
- ప్రతి రవాణా వాహనానికి జీపీఎస్ ట్రాకర్ ఏర్పాటు..
- 7 రకాల సన్నరకం ధాన్యానికే క్వింటాకు రూ.500 అదనపు ప్రోత్సాహకం..
- మౌళిక వసతులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసిన తర్వాతే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి..
- వర్షం నుంచి ధాన్యాన్ని రక్షించుకునేందుకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి..
- ఖరీఫ్ 2026 ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్.

ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 29 (అక్షరం న్యూస్)

ఖరీఫ్ (వర్షాకాలం) 2026 ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీ ప్రసాదరావుతో కలిసి సమీక్షించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నాణ్యత, రవాణా, నిల్వ, మౌళిక వసతులు, రైతులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు.

అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గతానికి భిన్నంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం కొనుగోలు కేంద్రాల నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డుల్లోని గోదాములకు లేదా గుర్తించిన ఫంక్షన్ హాళ్లకు, రైస్ మిల్లుల్లోని ఖాళీ ప్రదేశాలకు ధాన్యాన్ని తరలించాల్సి ఉంటుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం ముందుగా ప్రభుత్వ నియంత్రణలో ఉంటుందని పేర్కొన్నారు.బ్యాంకు గ్యారంటీలు చెల్లించి, గతంలో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బియ్యం డెలివరీని పూర్తిచేసిన రైస్ మిల్లులకే భవిష్యత్తులో ధాన్యం కేటాయింపులు చేయడం జరుగుతుందని తెలిపారు.రైస్ మిల్లర్ల పాత్ర లేకుండానే ముందుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నందున, ధాన్యం నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ఒక రోజులో కొనుగోలు కేంద్రం నుంచి ఎన్ని బస్తాలను రవాణా చేయగలుగుతారో అంత పరిమాణంలోనే ధాన్యాన్ని తూకం వేయాలని సూచించారు. రైస్ మిల్లుల మాదిరిగానే ధాన్యం నిల్వ చేసే గోదాముల వద్ద కూడా వేయింగ్ యంత్రాలను ఏర్పాటు చేసి, బరువు పరిశీలించిన అనంతరం ధాన్యాన్ని దించుకోవాలని తెలిపారు.ప్రతి లారీ, ట్రాక్టర్ తదితర ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ ట్రాకర్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ప్రత్యేక యాప్ ద్వారా అన్ని వాహనాల రవాణాను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.

### 7 రకాల సన్నరకం ధాన్యానికే రూ.500 అదనపు ప్రోత్సాహకం :

ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల ధాన్యాలను దీదీ 5204, =చీ= 15048, ఎమ్ జూచీూ, జీూ× ూ=× =ూవీ, ఖచీచీ 1638, ఔ+ూ 44, ఖచీచీ 7715 మాత్రమే సన్నరకంగా పరిగణించి, వాటికి క్వింటాకు అదనంగా రూ.500 ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు. ఈ ఏడు రకాల ధాన్యం నమూనాలను ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అందుబాటులో ఉంచాలని సూచించారు.గ్రేడ్-'ూ' ధాన్యానికి క్వింటాకు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,441 ధర ఉండగా, గుర్తించిన ఏడు రకాల సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 ప్రోత్సాహకం కలిపి క్వింటాకు రూ.2,961 లభించనున్నట్లు తెలిపారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. రైతు కొనుగోలు కేంద్రానికి వచ్చిన వెంటనే ధాన్యంలో తేమ శాతం, ఇతర వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, కొనుగోలు చేసిన పంటకు సంబంధించిన ట్యాబ్ ఎంట్రీలను ఎప్పటి కప్పుడు పూర్తి చేయాలని సూచించారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో వ్యవసాయ శాఖకు చెందిన ఏఈఓ లేదా ఒక వాలంటీర్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లు కూడా సన్నరకం ధాన్యాన్ని గుర్తించేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ శాఖ బృందం సన్నరకం ధాన్యం రకాన్ని ధృవీకరించాలని తెలిపారు.

### అక్టోబర్ 1 నుంచి 325 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు :

జిల్లాలో ఖరీఫ్ సీజన్ కోసం 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలను అక్టోబర్ 1, 2026 నుంచి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించి నట్లు తెలిపారు.

నవంబర్ 15 నుంచి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమయ్యే అవకాశం ఉందని, డిసెంబర్‌లో ధాన్యం రాక మరింత పెరుగుతుందని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జనవరి వరకు కొనుగోలు కేంద్రాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

సన్న, సాధారణ రకం ధాన్యానికి ప్రత్యేక ప్రదేశాలు :

ప్రతి కొనుగోలు కేంద్రంలో సన్నరకం, సాధారణ రకం ధాన్యానికి ప్రత్యేకంగా ప్రదేశాలను గుర్తించి స్పష్టమైన డిమార్కేషన్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. నవంబర్‌లో తుపాన్ల ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ప్రతిరోజూ ధాన్యంపై టార్పాలిన్ కప్పడం తప్పనిసరిగా చేయాలని అన్నారు.

### మౌళిక వసతులు లేకుండా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించవద్దు :

ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు, ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు, డిజిటల్ తదితర అవసరమైన మౌళిక వసతులు అందుబాటులో ఉన్న తర్వాతే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించా లని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లాలోని 325 కొనుగోలు కేంద్రాలకు అవసరమైన పరికరాల లభ్యతను పరిశీలించి, కొరత ఉన్న పరికరాలను వెంటనే సమకూర్చాలని అధికారులను ఆదేశించారు.

### ధాన్యం నాణ్యతా ప్రమాణాలు :

ధాన్యం కొనుగోలు సమయంలో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మట్టి పెడ్డలు, రాళ్లు గరిష్టంగా 1 శాతం, చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 5 శాతం, పూర్తిగా తయారుకాని, ముడుచుకుపోయిన ధాన్యం 3 శాతం, తక్కువ రకాల మిశ్రమం 6 శాతం వరకు ఉండాలని, తేమ శాతం గరిష్టంగా 17 శాతం ఉండాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.అంతకుముందు కొనుగోళ్లు, లోడింగ్, ఆన్ లోడింగ్ లపై రూపొందించిన సిపిఎస్ యాప్ అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డీసీఓ గంగాధర్, డిఎం సివిల్ సప్లయిస్ మల్లికార్జున్, మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 1న జాబ్ మేళా...

- జిల్లా ఉపాధి అధికారిణి మాధవి



ఖమ్మం / స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 29 (అక్షరం న్యూస్)

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పిం చేందుకు అక్టోబర్ 1 న (గురువారం) జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళా స్థానిక టీటీడీసీ (హవేలీ రెస్టారెంట్ ఎదురుగా) లో చేపడుతున్నట్లు అన్నారు. ఫ్లిప్కార్ట్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ ఌ డెలివరీ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం ఖాళీలు 20 వున్నట్లు, విద్యార్హత ఎస్సెస్సి (పదో తరగతి) ఉత్తీర్ణత లేదా ఆపైన ఉండాలని, వయస్సు 18 నుండి 40 సంవత్సరాల మధ్య ఉన్న పురుషులు/మహిళలు అర్హులని, జీతం నెలకు 17,000 రూపాయలు ం ఇన్సెంటివ్‌లు ఇవ్వబడతాయని ఉపాధి అధికారిణి అన్నారు. అభ్యర్థులకు తప్పనిసరిగా ద్విచక్ర వాహనం (బైక్) ఉండాలని, ఖాళీలు ఖమ్మంలోనే ఉంటాయని, అర్హత, ఆసక్తి ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యా అర్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో అక్టోబర్ 1 న (గురువారం) ఉదయం 10.00 గంటలకు టీటీడీసీ వద్ద జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎల్లలు దాటిన మానవత్వం.. వైద్యానికి ప్రాంతం లేదు..

- ఆపదలో ఆపద్బాంధవుడు.. గాయపడిన యువకుడికి డాక్టర్ రాజశేఖర్ గౌడ్ చేయూత..
- రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని స్వయంగా కారులో ఆస్పత్రికి తరలించిన డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్

ఖమ్మం/స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 29 (అక్షరం న్యూస్)



ఖమ్మం: విధి నిర్వహణ ముగించుకుని తిరిగి వెళ్తున్న ఖమ్మం డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చూసి మానవత్వంతో స్పందించిన ఘటన ఖమ్మం నగరంలో చోటుచేసుకుంది. కలెక్టరేట్ సమీపంలో జరిగిన ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన అభిషేక్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.వాటర్ క్యాన్లతో వెళ్తున్న ఆటో ట్రాలీ ప్రమాదానికి గురికావడంతో అభిషేక్ రోడ్డుపై తీవ్ర గాయాలతో పడిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు అక్కడ గుమిగూడారు. అదే సమయంలో కలెక్టరేట్‌లో విధులు ముగించుకుని తిరిగి వెళ్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ అక్కడి పరిస్థితిని గమనించారు.వెంటనే తన వాహనాన్ని ఆపి ప్రమాదానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అప్పటికే అటువైపు నుంచి 108 అంబులెన్స్ వెళ్లినప్పటికీ ప్రమాద బాధితుడిని తరలించకపోవడంతో, పరిస్థితిని గమనించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా గాయపడిన అభిషేక్‌ను తన కారులో ఎక్కించుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రికి చేరుకున్న అనంతరం బాధితుడి పరిస్థితిని స్వయంగా పరిశీలించగా ఈ ప్రమాదంలో అభిషేక్ కుడి తొడ భాగం విరిగినట్లుగా గుర్తించి అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుని, బాధితుడి పరిస్థితిని పర్యవేక్షించారు.ఒక జిల్లా స్థాయి వైద్యాధికారిగా తన విధులకే పరిమితం కాకుండా, ఆపదలో ఉన్న ఓ అపరిచితుడిని సొంత మనిషిలా భావించి తక్షణమే స్పందించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్ తీరు పలువురి ప్రశంసలు అందుకుంది.పరిచయం లేదు.. ప్రాంతం తెలియదు.. అయినా ఆపదలో ఉన్న ప్రాణాన్ని కాపాడాలనే మానవత్వంతో ముందడుగు వేశారు. వైద్యుడిగా తన బాధ్యతను ఆస్పత్రి గోడలకే పరిమితం చేయకుండా, రోడ్డుపైనే ఆచరణలో చూపించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్ సేవాభావం అందరికీ ఆదర్శంగా నిలిచింది.వైద్యానికి ఎల్లలు లేవు.. మానవత్వానికి హద్దులు లేవు”లి అన్న మాటకు డాక్టర్ రాజశేఖర్ గౌడ్ స్పందన ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది.



### విజయవంతంగా రెండు నెలలు

## పూర్తి చేసుకున్న మధిర ‘సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్’..





- 11 మండలాల్లోని 27,700 మంది విద్యార్థులకు రోజూ పోషకాహార అల్పాహారం..
- సమతుల్య మెనూతో విద్యార్థుల్లో
- పెరుగుతున్న ఏకాగ్రత, హాజరు శాతం..

ఖమ్మం/మధిర, సెప్టెంబర్ 29 (అక్షరం న్యూస్)

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘స్కూల్ బ్రేక్‌ఫాస్ట్’ ప్రోగ్రామ్‌లో భాగంగా మధిరలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ విజయవంతంగా రెండు నెలల రన్‌ను పూర్తి చేసుకుంది. 2026 జూలై 27న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించిన ఈ బృహత్తర కార్యక్రమం, ఆయన నిరంతర పర్యవేక్షణ, మార్గదర్శకత్వంలో నిరంతరాయంగా కొనసాగుతోంది.ఈ కేంద్రీకృత వంటశాల ద్వారా మధిరతో పాటు సమీపంలోని 11 మండలాల్లో ఉన్న 575 ప్రభుత్వ పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 27,700 మంది విద్యార్థులకు రోజువారీగా రుచికరమైన, శుభ్రమైన పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా అమలు భాగస్వామిగా వ్యవహరిస్తోంది.ఎన్ఐఎన్ ఆధ్వర్యంలో సమతుల్య మెనూ విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన పోషకాలు అందించేలా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ నేతృత్వంలో ప్రత్యేక అల్పాహార పట్టికను రూపొందించారు. వారంలో ప్రతిరోజూ వైవిధ్యమైన ఆహారంతో పాటు రోజు విడిచి రోజు వేడి పాలను అందిస్తున్నారు.

**వారపు అల్పాహార మెనూ.**

ఒకటవ రోజు ఇడ్లీ -- సాంబార్, రెండో రోజు పూరి -- ఆలూ కుర్మా, మూడో రోజు దోశ -- చట్నీ, నాల్గవ రోజు ఉప్మా -- చట్నీ, ఐదో రోజు మిల్లెట్ ఇడ్లీ -- సాంబార్, ఆరో రోజు బోండా -- చట్నీ అందిస్తున్నారు.

అత్యాధునిక వంటశాల -- వేగవంతమైన పంపిణీ..

అధిక సంఖ్యలో విద్యార్థులకు నిర్ణీత సమయానికి వేడివేడిగా అల్పాహారం అందించేందుకు ఈ కిచెన్‌లో ఆధునిక యంత్రాలను ఉపయోగిస్తున్నారు. గంటకు 5,400 ఇడ్లీలు, 3,600 పూరీలు, 2,000 దోశలు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన అత్యాధునిక వంటశాల కలిగి, ఆధునిక పరిశుభ్రతా ప్రమాణాలు పాటిస్తూ తయారు చేసిన అల్పాహారాన్ని ప్రత్యేక వాహనాల ద్వారా సకాలంలో పాఠశాలలు, కళాశాలలకు చేరవేస్తున్నారు.

**ప్రభుత్వ వ్యయం వివరాలు..**

విద్యార్థుల స్థాయిని బట్టి ప్రభుత్వం అల్పాహారానికి అయ్యే వ్యయాన్ని భరిస్తోంది.

ప్రాథమిక పాఠశాల (1--5 తరగతులు): రూ. 11.50 (ప్రతి విద్యార్థికి)

ఉన్నత పాఠశాల (6--10 తరగతులు): రూ. 13.50 (ప్రతి విద్యార్థికి)

జూనియర్ కళాశాల: రూ. 13.50 (ప్రతి విద్యార్థికి)

పాలు (రోజు విడిచి రోజు): విద్యార్థికి రూ. 1.08 చొప్పున కేటాయింపు.

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు హరే కృష్ణ మూవ్‌మెంట్ కృతజ్ఞతలు..

ఉదయాన్నే పోషకాహారం అందడం వల్ల విద్యార్థులు ఖాళీ కడుపుతో తరగతుల్లో కూర్చోవాల్సిన అవసరం తప్పిందని, దీనివల్ల వారి ఏకాగ్రతతో పాటు పాఠశాలల్లో హాజరు శాతం మెరుగవుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ వంటశాల నిర్మాణానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఆర్థిక సహాయం అందించిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.



## క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం పకడ్బందీగా అమలు చేయాలి...



- అదనపు కలెక్టర్ శ్రీజ
- పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల పర్మినెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్స్‌ను పూర్తి చేయాలి..
- ఆసుపత్రుల్లో పార్కింగ్, ఇతర ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి..
- లోపాలున్న డయాగ్నస్టిక్ కేంద్రాలపై చట్టప్రకారం చర్యలు..

ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 29( అక్షరం న్యూస్)

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం--2010ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, వైద్య సేవలందించే సంస్థలు నిర్దేశిత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్--2010 క్రింద జిల్లా స్థాయి అప్రోప్రియట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రామారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం అమలు, రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్, తనిఖీలు, ఆసుపత్రులు, క్లినిక్స్, డయాగ్నస్టిక్ కేంద్రాల స్థితిగతులపై కమిటీ సమీక్షించింది.

**పెండింగ్ రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ పూర్తి చేయాలి :**

జిల్లాలో పర్మినెంట్ రిజిస్ట్రేషన్, పర్మినెంట్ రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల పర్మినెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియను వచ్చే నెలలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియలో నిబంధనలు, కనీస ప్రమాణాలు, అవసరమైన అనుమతులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.



**పార్కింగ్ విషయంలో ఆసుపత్రుల వర్గీకరణ :**

ఆసుపత్రులకు అనుమతులు ఇచ్చే సమయంలో పార్కింగ్ సౌకర్యాన్ని పరిశీలించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో పార్కింగ్ సదుపాయంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. అదే సమయంలో 10 పడకల లోపు ఉన్న నర్సింగ్ హోమ్‌ల విషయంలో పార్కింగ్ అంశాన్ని అనవసరంగా ప్రతిబంధకంగా మార్చకుండా, నిబంధనలకు అనుగుణంగా వాటిని వర్గీకరించి, అర్హత ఉన్న సంస్థలకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు.

**లోపాలున్న డయాగ్నస్టిక్ కేంద్రాలపై కఠిన చర్యలు :**

జిల్లాలో ఇప్పటికే 16 డయాగ్నస్టిక్ కేంద్రాలను తనిఖీ చేయగా, పలు లోపాలు గుర్తించినట్లు అధికారులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ నేపథ్యంలో ఆయా సంస్థలకు నోటీసులు జారీ చేసి, గుర్తించిన లోపాలను నిర్దేశిత గడువులోగా సరిదిద్దుకునేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. లోపాలను సరిదిద్దని సంస్థలకు రిజిస్ట్రేషన్ ఇవ్వకూడదని, గడువు అనంతరం కూడా నిబంధనలు పాటించని సంస్థలపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం సంస్థలను సీజ్ చేసి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమీక్ష :**

2026 జూలై 27 నుంచి ఇప్పటి వరకు ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 29 దరఖాస్తులు అందగా, 20 ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు, 9 దరఖాస్తులు ప్రక్రియలో ఉన్నట్లు సమావేశంలో తెలిపారు. పర్మినెంట్/రెన్యువల్ పర్మినెంట్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 52 దరఖాస్తులు అందగా, 16 దరఖాస్తులు ప్రక్రియలో ఉన్నట్లు, 24 దరఖాస్తులను ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయానికి పంపినట్లు వివరించారు. ట్రాఫిక్ అంశం కారణంగా 3 దరఖాస్తులకు సిఫార్సు చేయలేదని అధికారులు తెలిపారు.

**నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు :**

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం వైద్య సంస్థలు రిజిస్ట్రేషన్, మౌళిక సదుపాయాలు, సిబ్బంది, పరికరాలు, రికార్డుల నిర్వహణ తదితర కనీస ప్రమాణాలను పాటించేలా నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలకు ముందుగా నోటీసులు జారీ చేసి, నిర్దేశిత గడువులోగా లోపాలను సరిదిద్దుకునే అవకాశం కల్పించాలని, గడువు అనంతరం కూడా నిబంధనలు పాటించని సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం అమలును మరింత పటిష్టం చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. నరేందర్, కమిటీ సభ్యులు, సంబంధిత వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ మట్టా దయానంద్ ను కలిసిన వడ్డే రామారావు, తాతా భాస్కర్ రావు..

ఖమ్మం/తల్లాడ టౌన్ సెప్టెంబర్ 29 (అక్షరం న్యూస్)

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ను తల్లాడ మండలంలోని కలకోడిమ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డే రామారావు, సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు తాతా భాస్కర్ రావు కలిశారు. మంగళవారం సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో వారు కొద్దిసేపు చ ర్చిం చా రు . గ్రామాభివృద్ధి కి నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



## మృతుల కుటుంబాలకు బియ్యం అందజేసిన కౌన్సిలర్ తూర్పాటి చందన శంకర్

కరీంనగర్/జమ్మికుంట/సెప్టెంబర్ 2 9/అక్షర న్యూస్: మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో ఇటీవల ఆరోగ్య కారణాలతో మృతి చెందిన రెండు కుటుంబాలను వార్డు కౌన్సిలర్ తూర్పాటి చందన శంకర్ పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబాలకు తనవంతు సహాయంగా ఒక్కొక్క కుటుంబానికి 50, కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## రైతుల సంక్షేమమే సహకార సంఘం లక్ష్యం

**•సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్**




చిగురు మామిడి/సెప్టెంబర్ 29, అక్షరం న్యూస్,
రైతుల సంక్షేమం కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నిరంతరం పనిచేస్తుందని సింగిల్ విండో చైర్మన్ చిట్టు మల్ల రవీందర్ అన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన అర్ధ వార్షిక మహాసభ సమావేశంలో వారు మాట్లాడుతూ... రైతుల పరస్పర సహకారంతోనే సహకార సంఘం అభివృద్ధి సాధ్యమవుతుందని రైతులు తాము తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం మరింత అభివృద్ధి చెందడానికి కృషి చేయాలని చిట్టి మల్ల రవీందర్ అన్నారు. రైతులకు ఎరువులు సకాలంలో అందేట్టుగా, చూస్తామని, మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో చిగురుమామిడి మండలంలో నూతన గోదాములు, రైస్ మిల్లులు నిర్మాణాలు, సోలార్ ప్లాంటేషన్ ఏర్పాటు పనుల కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,సర్పంచ్ లు ఆకవరం భవాని, మార్క రాజ్ కుమార్ గౌడ్, చింతపూల నరేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్, సాంబారి భారతమ్మ,కాటం సంపత్ రెడ్డి,అలువాల శంకర్, అల్లెపు సంపత్,డిసిసి కార్యదర్శి బదుకోలు దేవేందర్ రెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్లు పోటు మల్లారెడ్డి,చాడ మహిపాల్ రెడ్డి,పిల్లి కొమురయ్య, శ్రీరామోజు రాజకుమార్, కుతాటి తిరుపతి, లక్ష్మి, సాయన్న,కనగండ్ల శ్రీనివాస్,బాల్ రెడ్డి, మర్రి శ్రీనివాస్, భాగ్య, పరశురాములు,సంఘం ఇన్చార్జి సీఈఓకుమారస్వామి,సహకార సంఘం అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వైరా అవని మహిళ క్లబ్ ఆధ్వర్యంలో మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదానం.



ఖమ్మం/ వైరా సెప్టెంబర్ 29 (అక్షరం న్యూస్)
వైరా అవని మహిళ క్లబ్ ఆధ్వర్యంలో బోనకల్ లో ఉన్న మానసిక వికలాంగుల కేంద్రంలో అవని సభ్యురాలు ప్రసన్న కుమార్తె పుట్టినరోజు పురస్కరించుకొని రెండవ రోజు వికలాంగుల కేంద్రంలో 50 మంది మానసిక వికలాంగులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగుల సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ వైరా లయన్స్ క్లబ్బుల ఆధ్వర్యంలో చాలాసార్లు అన్నదాన కార్యక్రమం చేపట్టారని వారు గుర్తు చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్బుల నిర్వాహకులను వారు అభినందించారు. ఈ సందర్భంగా అవనీ క్లబ్ అధ్యక్షురాలు గద్దె నీరజ సెక్రెటరీ సుగ్గల మాధవి మాట్లాడుతూ అవని క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు పదికి సేవా కార్యక్రమాలు నిర్వహించామని వృద్ధులను మానసిక వికలాంగులను ఆదుకోవడంలోనే మానసిక సంతృప్తి ఉంటుందని వారికి సేవ చేయటం సంతృప్తికరంగా ఉందని వారు తెలిపారు. మా క్లబ్ ఆధ్వర్యంలో ఇంకా అనేక సేవా కార్యక్రమాలను దాతల ద్వారా సేవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అవని క్లబ్ కోశాధికారి కొదుమూరి భాగ్యలక్ష్మి సభ్యులు నాళ్ళ నాగమల్లేశ్వరి
అరుణ రాజ్యలక్ష్మి నిర్మల వడ్లమూడి విజయ రత్న కుమారి చెరుకుపల్లి వెంకటేశ్వరరావు చెరుకూరి శ్రీనివాసరావు ఆశ్రమం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## కోహ్లీని స్వేచ్ఛగా ఆడనిస్తే ఒంటిచేత్తో గెలిపిస్తాడు

**భారత క్రికెట్ జట్టు కెప్టెన్ శుభమన్ గిల్ ప్రశంసల వర్షం**

భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీపై భారత క్రికెట్ జట్టు కెప్టెన్ శుభమన్ గిల్ ప్రశంసల వర్షం కురిపించాడు. తిరువనం తపురం వేదికగా పర్యాటక వెస్టిండీస్ జట్టుతో ఆదివారం జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతా ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ గిల్, స్టార్ ఆటగాడు కోహ్లీ శతకాలతో రెచ్చిపోయారు. ఫలితంగా ప్రత్యర్థి నిర్ధేశించిన 295 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా 41.4 ఓవర్లలోనే చేరుకుంది. మ్యాచ్ అనంతరం కెప్టెన్ గిల్ స్పందిస్తూ, మ్యాచ్ అనంతరం కెప్టెన్ శుభ్మన్ గిల్ మాట్లాడుతూ, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన విరాట్ కోహ్లిపై ప్రశంసల వర్షం కురిపించాడు. 'విరాట్ భాయ్‌ను తన ఆటను ఆస్వాదించనివ్వాలి. అతడిని ఎలాంటి ఒత్తిడికి గురిచేయాల్సిన అవసరం లేదు. తనదైన రోజున ఎలాంటి మ్యాచ్‌నైనా ఒంటిచేత్తో గెలిపించగల సత్తా అతడికి ఉంది.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు మాజీ ఎంపీ నామ శ్రీకారం



**•కుటుంబ సభ్యుల వివరాలు నమోదుతో గ్రాడ్యుయేట్ ఓటర్ ఎన్‌రోల్‌మెంట్**
**•ప్రారంభించిన - మాజీ ఎంపీ నామ**
**•గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై నామ**
**•ప్రత్యేక దృష్టి - మాజీ ఎంపీ నామ**
**•అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటర్లుగా నమోదు కావాలి - మాజీ ఎంపీ నామ**

ఖమ్మం/స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 29 (అక్షరం న్యూస్)
ఖమ్మం: వరంగల్--ఖమ్మం--నల్గొండ నియోజకవర్గం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఓటర్ల నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో ముందుగా తన కుటుంబ సభ్యుల గ్రాడ్యుయేట్ వివరాలను నమోదు చేయించారు. నామ సతీమణి చిన్నమ్మ, కుమారులు పృథ్వి తేజ, భవ్య తేజ ల తో పాటు కమ్మ రవి, కమ్మ జ్యోత్స్న, కిలారి ఉదయ్, రమ్యకృష్ణ, నామ సాయిరాం, కావ్య, రవీందర్, ప్రసన్న కుమారి తదితర 15 మంది కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయించారు. అనంతరం పలువురు గ్రాడ్యుయేట్ల వివరాల నమోదుకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 30 మంది గ్రాడ్యుయేట్ల వివరాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా నామ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పిస్తూ, అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు కీలకమైనందున అర్హులైన పట్టభద్రులందరి వివరాలను సేకరించి నమోదు చేయించే దిశగా బీఆర్ఎస్ శ్రేణులు పనిచేయాలని నామ సూచించారు. ఖమ్మం నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో ఆయా ప్రాంతాల్లో ఉన్న గ్రాడ్యుయేట్లను సంప్రదించి, నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. ఇటీవల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా గ్రాడ్యుయేట్ ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్‌పై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన నేపథ్యంలో నామ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గడువు లోపు గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టి, అర్హులైన వారందరి వివరాలను నమోదు చేయించాలని నామ సూచించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా టీం ఈ ఎన్‌రోల్మెంట్ డ్రైవ్‌లో చురుగ్గా పాల్గొని, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌తో దరఖాస్తు చేయించాలని నామ సూచించారు.

# అక్రమంగా పెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకున్న మహిళ





**పువ్వాళ్ళ వెంకటేశ్వరరావు మృతిపై**
**సమగ్ర విచారణ చేపట్టాలి..**
**జిల్లా పోలీస్ కమిషనర్ కు కుటుంబ**
**సభ్యుల ఫిర్యాదు..**
**బెజవాడ కళావతి పేరుతో**
**రేషన్ కార్డు వితంతు పెన్షన్ తీసుకుంటూ ప్రభుత్వ అధికారులను పక్కదోవ పట్టించిన మహిళ..**

ఖమ్మం/ వైరా టౌన్ సెప్టెంబర్ 29 (అక్షరం న్యూస్)
వైరా ఇన్సిపాలిటీ తొమ్మిదో వార్డు.లో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఎదురుగా జరిగిన కారు యాక్సిడెంట్ ప్రమాదంలో మృతి చెందిన పువ్వాళ్ళ వెంకటేశ్వరరావు మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని కుటుంబ సభ్యుడైన పువ్వాళ్ళ శ్రీనివాసరావు జిల్లా పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు తన అన్న అయిన పువ్వాళ్ళ వెంకటేశ్వరరావు వైరా మున్సిపాలిటీ 9వ వార్డులో వ్యవసాయ మార్కెట్ ఎదురుగా నివసిస్తున్నాడు. గత కొంతకాలంగా ఇందిరమ్మ కాలనీకి చెందిన బెజవాడ కళావతి అనే వితంతు మహిళ తోడుగా ఉంటూ మాయ మాటలతో తమ కుటుంబ సభ్యుల ఆస్తిని కాజేసేందుకు అక్రమంగా జనవరి 30..2026 తేదీన వైరా రిజిస్టర్ కార్యాలయంలో పెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకున్నదని ఫిర్యాదు చేశారు మరల ఆమె బెజవాడ కళావతి అనే పేరుతో వితంతురాలి గానే ఉన్నానని ప్రభుత్వ అధికారులను పక్కదారి పట్టించి రేషన్ కార్డు తో పాటు వితంతు పెన్షన్ పొందుతుందని తెలిపారు. ఈనెల 9 వ తేదీన తన అన్న వెంకటేశ్వరరావు మార్కెట్ యార్డ్ ఎదురుగా నడిచి వస్తుండగా నెంబర్ లేని కారు ఢీ కొట్టిందని ఈ ప్రమాదంలో తన అన్న గాయపడటంతో తమకు సమాచారం అందించకుండా కొంతమంది వ్యక్తులు. కళావతి అంబులెన్స్ లో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారని తెలిపారు.అక్కడ రెండు రోజులు వైద్య చికిత్సలు పొందుతూ మృతి చెందటంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారని తెలిపారు తమ కుటుంబ సభ్యులకు తెలియకుండా బెజవాడ కళావతి అనే మహిళ తో పాటు స్థానిక కొంతమంది వ్యక్తులు అంత్యక్రియలు నిర్వహించారని తెలిపారు.అన్న చనిపోయాడని కుటుంబ సభ్యులు బంధువులు అంతా కలిసి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళితే కళావతి తో పాటు కొంతమంది వ్యక్తులు తమను అడ్డుకున్నారని కేసును పక్కదోవ పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రమాదానికి గురైన కారు బాధ్యులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



# స్కూల్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు,షూస్ పంపిణీ చేసిన బిల్లుపాడు సర్పంచ్ ఎన్నిక కృష్ణవేణి నరసింహారావు





ఖమ్మం/తల్లాడ సెప్టెంబర్ 29( అక్షరం న్యూస్)
పేద, మధ్య తరగతి విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా సర్పంచ్ ఎన్నిక కృష్ణవేణి నరసింహారావు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పనిచేస్తుంది. మంగళవారం తల్లాడ మండల పరిధిలోని బిల్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకుతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన కొత్త యూనిఫామ్స్ షూస్, బెల్టులు ని బిల్లుపాడు సర్పంచ్ ఎన్నిక కృష్ణవేణి నరసింహారావు కాంగ్రెస్ పార్టీ నాయకులు జగ్గంపూడి కిషోర్ఆధ్వర్యంలో అందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణవేణి నరసింహారావు కాంగ్రెస్ పార్టీ నాయకులుకిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అన్ని ఉచితం అందిస్తూ, నాణ్యమైన విద్యని బోధిస్తున్న మన ప్రభుత్వ విద్య విధానాన్ని కొనియాడారు.
ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తూ సర్కార్ పూర్తి భరోసా ఇస్తుందని, విద్యార్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి బి. సాయికుమార్,బిల్లుపాడు నాయకులుసామినేని రామప్పరావు ,ఉపాధ్యాయులు,కాంగ్రెస్పార్టీ నాయకులుగ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ..జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోమాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దీవెల కృష్ణయ్య ప్రకార్తతో ధర్నా..



ఖమ్మం/తల్లాడ సెప్టెంబర్ 29 (అక్షరం న్యూస్)

భారత ప్రజాస్వామ్యానికి శాపంగా మారిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం నాయకులు డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో జరిగిన ధర్నా లో దీవెల కృష్ణయ్య ప్రసంగించారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు ఆందోళన చేస్తామని ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని జైలుకు సహితం వెళ్తామని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దీవెల కృష్ణయ్య అన్నారు. భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతుందని వీటిని కాపాడుకునేందుకు పౌర సమాజం కదలాలనే వారు కోరారు. ఈ కార్యక్రమంతో వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, వైరా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వీరంశెట్టి సీతారాములు, వైరా ఏడవ వార్డు కౌన్సిలర్ పనితి సైదులు , కాంగ్రెస్ పార్టీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఓట్లు నమోదు చేసుకోండి

- డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ



ఖమ్మం/ వైరా సెప్టెంబర్ 9 (అక్షరం న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఖమ్మం నల్గొండ వరంగల్ ఉమ్మడి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎన్నికల సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పట్టభద్రులందరూ తమ ఓట్లు నమోదు చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి నుండి ఆన్లైన్ ఆఫ్ లైన్ ద్వారా మీరు మీ కుటుంబంలోని గ్రాడ్యుట్లు మీకు తెలిసిన మీ స్నేహితులంతా అందరిని వారి వారి ఓటర్ నమోదు చేసుకునే ప్రక్రియలో ఉండాలని కోరారు. ఏదైనా ఒక డిగ్రీ పూర్తి చేసిన వారు ప్రతి ఒక్కరు కొత్త ఓటు నమోదు చేసుకుని రాబోయే పట్టభద్రుడు ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు తెలియజేయవలసిందిగా కోరారు. మంగళవారం నుండి ప్రారంభమై నవంబర్ 6 వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని ఆమె తెలిపారు.

## మహిళల ట్రాప్ షూటింగ్‌లో భారత్‌కు తొలి వ్యక్తిగత స్వర్ణం!

ప్రస్తుత సీజన్‌లో భారత శిబిరంలో నెలకొన్న వ్యక్తిగత విభాగపు స్వర్ణ పతక లోటును భర్తీ చేస్తూ స్టార్ షూటర్ నీరూ దండా చరిత్ర సృష్టించారు. మహిళల ట్రాప్ షూటింగ్ వ్యక్తిగత విభాగంలో తిరుగులేని ప్రదర్శనతో అగ్రస్థానంలో నిలిచిన ఆమె, బంగారు పతకాన్ని ముద్దాడారు. ఈ విజయంతో 2026 ఆసియా క్రీడల్లో భారత్‌కు ఐదో స్వర్ణ పతకం లభించినట్లయింది. లక్ష్యాన్ని గురిచూసి కొట్టడంలో అద్భుత నైపుణ్యాన్ని కనబరిచిన నీరూ దండా ఫైనల్స్‌లో ప్రత్యర్థులపై పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. అంతకుముందు జరిగిన మహిళల ట్రాప్ షూటింగ్ టీమ్ ఈవెంట్‌లోనూ నీరూ రజత పతకం సాధించిన భారత జట్టులో సభ్యురాలిగా ఉన్నారు. ఆషిమా అహ్లావత్, మనీషా కీర్‌లతో కూడిన భారత త్రయం అద్భుత సమన్వయంతో రజతాన్ని కైవసం చేసుకోగా, వ్యక్తిగత విభాగంలో నీరూ ఏకంగా స్వర్ణాన్ని సాధించి తన పతక స్థాయిని పెంచుకున్నారు. ఈ క్రీడల్లో అంతకుముందు భారత్ సాధించిన నాలుగు స్వర్ణాలు కూడా జట్టు విభాగాల్లోనే వచ్చాయి. మహిళల క్రికెట్ ఫైనల్ పోరులో హర్మన్‌ప్రీత్ సేన సాధించిన చారిత్రక విజయం దేశానికి తొలి పసిడిని అందించగా, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి సింగ్, కమల్‌జీత్ జంట రెండో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. ఇక సంప్రదాయ క్రీడ కబడ్డీలో పురుషుల, మహిళల జట్లు రెండూ ఎదురులేని ఆధిపత్యంతో బంగారు పతకాలను భారత్ ఖాతాలో చేర్చాయి. ఇప్పటివరకు వచ్చిన పసిడి పతకాలన్నీ టీమ్ ఈవెంట్స్‌లోనే కావడం గమనార్హం. అయితే నీరూ దండా సాధించిన ఈ విజయంతో వ్యక్తిగత విభాగంలోనూ భారత్‌కు స్వర్ణ బోణీ పడింది. ఈ విజయంతో పతకాల పట్టికలో భారత స్థానం మరింత మెరుగైంది. భారత్ ఒక స్థానం ముందుకు ఎగబాకి ప్రస్తుతం 11వ స్థానానికి చేరుకుంది. భారత్ ఖాతాలో ఇప్పటివరకు 5 స్వర్ణాలు, 21 రజతాలు, 21 కాంస్య పతకాలు కలిపి మొత్తం 47 పతకాలు చేరాయి. వ్యక్తిగత విభాగంలో చారిత్రక స్వర్ణం అందించిన నీరూ దండాపై దేశవ్యాప్తంగా క్రీడా వర్గాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## రీఎంట్రీ ఇవ్వనున్న సిరాజ్

వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా మరో ఆసక్తికరపోరుకు సిద్ధమైంది. గువహతి వేదికగా బుధవారం జరగనున్న రెండో వన్డేలో పర్యాటక విండీస్‌తో ఆతిథ్య భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్‌ల విధ్వంసకర శతకాలతో తొలి మ్యాచ్‌లో గెలిచిన భారత్.. మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో వన్డేలోనూ విజయం సాధించి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలనుకుంటోంది. తద్వారా ఆఖరి వన్డేలో బెంచ్ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. మరోవైపు తొలి వన్డేలో చేసిన తప్పిదాలను సరిచేసుకొని రెండో మ్యాచ్‌లో విజయం సాధించాలనే పట్టుదలతో వెస్టిండీస్ ఉంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# తల్లాడలో మండల స్థాయి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం..

- ఎంపీడీవో ఏ శ్రీధర్ రాజు



ఖమ్మం/తల్లాడ టౌన్ సెప్టెంబర్ 29 (అక్షరం న్యూస్)

తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గౌరవ సర్పంచ్ లు, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపాలపేట సర్పంచ్ శ్రీమతి తాళ్ళ సుధారాణి మాట్లాడుతూ నరసింహ రావు పేట ఓ గోపాలపేట లోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించాలని కోరారు, తదుపరి అడిషనల్ ఏసీడీపీఓ పద్మావతి మరియు సూపర్వైజర్ సందర్శిస్తామని హామీ ఇచ్చారు. కులాంతర వివాహాలు చేసుకున్న దళిత అభ్యర్థులకు స్వయం ఉపాధి కల్పన కోసం 2,50,000 ప్రోత్సాహక నగదు ఆర్థిక సహాయం ఉందని విదేశాలకు వెళ్లు విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసే అవకాశం ఉందని ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖ సహాయ అధికారి యం వీరన్న వివరించారు, ఈ సందర్భంగా సర్పంచులు కొడవటిమెట్ట , అన్నారుగూడెం, గోపాలపేట చర్చలో పాల్గొన్నారు. తల్లాడ సర్పంచ్ ఎస్సీ బాలికల హాస్టల్ లో మంచి నీటి బోర్ వేయాలని కోరారు, గాంధీనగర్ తండా లో విద్యుత్ సరఫరా పై ఏఈ ని ప్రశ్నించి సమాధానం పొందారు, ఏఈ హౌసింగ్ ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి నివేదిక సమర్పించారు, 103 గృహాల నిర్మాణాలు గృహ ప్రవేశాల స్థాయి కి తీసుకురావాలని గౌరవ సర్పంచ్ లను, ఇందిరమ్మ కమిటీ సభ్యులను, పంచాయితీ కార్యదర్శులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఎంపీడీవో సమీక్షించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని అధికారులకు, సర్పంచ్ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా ప్రత్యూష, వెటర్నరీ డాక్టర్ రాజు, మండల వ్యవసాయ అధికారి తాజుద్దీన్,ఎంపీ ఓ హరి క్రిష్ణ హార్టీ కల్చర్ అధికారి వినోద, ఇరిగేషన్ ఇంజనీర్ నవ్య, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ హనుమంత్, ఏపీఎం రవి,ఏపీఓ కోటయ్య మండల విద్యాశాఖ అధికారి సెలవులో ఉన్నందున చర్చ జరగలేదు, పంచాయితీ రాజ్ శాఖ ఇంజనీర్ శిక్షణ లో ఉన్నందున చర్చ జరగలేదు, మత్స్య శాఖ, సహకార శాఖ క్షేత్ర స్థాయి అధికారులు రానందున చర్చ జరగలేదు... జిల్లా మత్స్య శాఖ అధికారి మరియు మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్ సెలవులో ఉన్నందున ప్రత్యేక పరిస్థితుల్లో ఎంపీడీఓ ఏ శ్రీధర్ రాజు అధ్యక్షత వహించారు..

# ప్రజా సంక్షేమ ధ్యేయం





- గ్రామ ప్రజల సమస్యలు పరిష్కారానికి ముందుంటాం..
- వెంగన్నపేట సర్పంచ్ బోడ మౌనిక బాలకృష్ణ

ఖమ్మం/తల్లాడ సెప్టెంబర్ 29 (అక్షరం న్యూస్) వెంగన్నపేట గ్రామ ప్రజల సమస్యలు పరిష్కారానికి ఎప్పుడు ముందుండి పరిష్కరిస్తుంటాం సర్పంచ్ బోడ మౌనిక బాలకృష్ణ.. సోమ వారం తల్లాడ మండల పరిధిలోని వెంగన్నపేట గ్రామంలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో వెంగన్నపేట సర్పంచ్ బోడ మౌనిక బాలకృష్ణ ఆధ్వర్యంలో సైడ్ డ్రైనేజ్ కు కొత్త సిమెంట్ పైపులు జెసిపి సాయంతో డ్రైనేజీ కాలువలు పైపులు అమర్చారు. అదేవిధంగా :-

మంచినీటి పైపులు లీకేజ్ అవడంతో తాగునీరు శేఖర అయ్యే పైపు పలవడంతో తాగునీరు సార్ అంతరాయం లేకుండా గ్రామపంచాయతీ సిబ్బంది తో రిపేర్ చేయించారు.

మంచినీటి బావి చుట్టూ వర్షాకాలం నేపథ్యంలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి ఉన్న పిచ్చి మొక్కలను చెత్తాచెదారమును తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్,కోటేశ్వరరావు, రాములు, తావు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోహ్లీ కెప్టెన్సీకి నేను వీరాభిమానిని..

## ఆ వార్తలను చూసి నవ్వుకుంటాం మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడి




టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ప్రశంసల జల్లు కురిపించాడు. కోహ్లీ ఏ మాత్రం మారలేదని, అతనితో బ్యాటింగ్ చేయడం చాలా సరదాగా ఉంటుందని చెప్పుకొచ్చాడు. తమ మధ్య విభేదాలు ఉన్నాయంటూ వచ్చే వార్తలను చూసి ఇద్దరం నవ్వుకుంటామని తెలిపాడు. విరాట్ కోహ్లీ టెస్ట్ కెప్టెన్సీకి తాను వీరాభిమానిని అని చెప్పాడు. వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను విరాట్ కోహ్లీ సెంచరీతో మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. తొలి వన్డేలో విధ్వంసకర శతకంతో చెలరేగిన కోహ్లీ.. భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. తాజాగా జియో హాట్‌స్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోహ్లీ గురించి రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. జట్టును గెలిపించాలనే తపన అతనిలో ఏ మాత్రం తగ్గలేదన్నాడు. 'విరాట్ కోహ్లీ భారత జట్టు కోసం ఏం చేశాడనేది అందరికీ తెలుసు. దాన్ని ఎవరూ ప్రశ్నించలేరు. ప్రతీ రోజు మైదానంలోకి రావడం, బాగా ప్రాక్టీస్ చేయడం, పరుగులు సాధించి భారత్‌ను గెలిపించడం... కోహ్లీ దినచర్య. ఈ విషయంలో ఏది మారలేదు. తను కెప్టెన్‌గా ఉన్నప్పుడైనా.. నేను సారథిగా ఉన్నా కోహ్లీ మారలేదు. ఇక ముందు కూడా మారడు. టెస్ట్ కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ భారత జట్టును నడిపించిన తీరు అద్భుతం. అతని టెస్ట్ కెప్టెన్సీకి నేను వీరాభిమానిని. ఇప్పటికీ మా ఇద్దరి మధ్య ఆటను ఎలా మెరుగుపర్చుకోవాలో అనే చర్చ జరుగుతూనే ఉంటుంది. మా ఇద్దరి మధ్య ఏదో గొడవ ఉందంటూ టీవీల్లో వచ్చే వార్తలను చూసి మేం నవ్వుకుంటాం. జనాలు 'మసాలా' వార్తలు కోరుకుంటారు. అందుకే అలాంటి కథనాలు వస్తుంటాయి. నేను 2007లో, విరాట్ 2008లో అరంగేట్రం చేశాం. దాదాపు ఒకే సమయంలో కెరీర్ మొదలుపెట్టి సుదీర్ఘ కాలంగా భారత జట్టుకు ఆడుతున్నాం. మా ఇద్దరి విధానం వేరు కావచ్చు. కానీ ప్రపంచకప్ గెలవాలి అనే లక్ష్యం మాత్రం ఒకటే. బ్యాటింగ్ చేస్తున్నప్పుడు మా మధ్య మంచి బాండింగ్ ఉంటుంది. ఎవరి బౌలింగ్‌లో అటాక్ చేయాలి? ఎప్పుడూ సింగిల్ తీయాలి? అని ప్లాన్ చేసుకుంటాం. నా కాలుకేమైనా సమస్య అనిపిస్తే.. 'భయ్యా.. కాస్త చూసి పరుగెత్తు. నా కాలు కాస్త ఇబ్బందిగా ఉంది'అని విరాట్‌తో చెబితే.. తను వెంటనే అర్థం చేసుకొని సహకరిస్తాడు. తన ఆటనే మార్చుకుంటాడు. కోహ్లీకి ప్రపంచకప్ ప్రాముఖ్యత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. భారత జట్టులో అత్యధికంగా 4 వన్డే ప్రపంచకప్‌లు(2011, 2015, 2019, 2023) ఆడిన అనుభవం అతనికి మాత్రమే ఉంది. 2007 ప్రపంచకప్ అయినా.. మరో టోర్నీ అయినా విజయం కోసం కోహ్లీ ఎంతలా పరితపిస్తాడో అందరికి తెలుసు. బ్యాటింగ్ సమస్యల గురించి ఇద్దరం మాట్లాడుకుంటాం. ఒకరికొకరం సలహాలు ఇచ్చుకుంటాం. కానీ ఇప్పుడు మేమిద్దరం వన్డేలు మాత్రమే ఆడుతుండటంతో ఎక్కువగా కలవలేకపోతున్నాం. పైగా అతను నాకు చాలా దూరంగా నివసిస్తున్నాడు. గతంలో కాకుండా ఇప్పుడు ఇంట్లో కుటుంబంతో ఎక్కువ సమయం గడపడానికి మాకు టైమ్ దొరుకుతుంది.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609